
సాక్షి ఒడిశా
ఆదివారం । 18 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.7,65,954
బంగారం 910 మిల్లీ గ్రాములు
వెండి 38 గ్రాముల 780 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



సిమ్ బాక్స్ జప్తు

ఒడిశాలోని భువనేశ్వర్ నగరంలో వెలుగు చూసిన సిమ్ బాక్స్ బాగోతం సంచలనం రేపుతోంది.

- 8లో



రాజ్యాంగం మార్గదర్శకం కావాలి

అసెంబ్లీలో ప్రతీ ఎమ్మెల్యేకి రాజ్యాంగం మార్గదర్శకం కావాలని సీఎం మోహన్‌చరణ్ మాఝీ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

భువనేశ్వర్: ఝూర్సుగుడ జమేరా యూజీఎం ఈ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం మధ్యాహ్న భోజనం తర్వాత 50 మందికి పైగా విద్యార్థులకు కడుపు నొప్పి రావడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే సకాలంలో చికిత్స అందడంతో అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ప్రథమ చికిత్సతో పలువురు బాధిత విద్యార్థులు ఇంటికి తిరిగి వెళ్లారు. మరో 15 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానిక మండల విద్యాధికారి విద్యార్థుల చికిత్స, వైద్య సదుపాయాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. పాడైపోయిన గుడ్లు తినడం వలనే ఈ పరిస్థితి తలెత్తినట్లు తెలుస్తోంది.

మొబైల్ షాపులో చోరీ



చోరీ జరిగిన మొబైల్ షాపు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మొబైల్ షాపులో చోరీ జరిగింది. శనివారం ఉదయం జిల్లా కేంద్ర ఆస్పత్రి సమీపంలోని మా సరళా మొబైల్ షాపు యజమాని చాంద్ దాస్ దుకాణం తెరిచేందుకు వెళ్లినప్పుడు తన షాపులో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా 18 స్మార్టు ఫోన్లు, 16 కీ ప్యాడ్ ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు, ఒక కంప్యూటర్, ఒక ప్రింటర్, రూ.25 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. దుకాణం ముందు ఉన్న షట్టర్ విరగ్గొట్టి దొంగలు లోపలికి ప్రవేశించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇటీవల నబరంగ్‌పూర్ పట్టణంలో ఇటువంటి దొంగతనాల సంఖ్య పెరిగింది. దీంతో రాత్రిపూట గస్తీ పెంచమని ప్రజలు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి 15 మందికి గాయాలు

- ముగ్గురి పరిస్థితి విషమం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి దోహన-డోంగ్రురుబజ గ్రామాల మధ్య ఆటో బోల్తాపడిన ఘటనలో 15 మందికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో వెంటనే స్థానిక గిరిజనులు నందాహండి జోన్ 2 జిల్లా పరిషత్ సభ్యుడు అరుణ్ మిశ్రకి సమాచారం ఇచ్చారు. అతను వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను నందాహండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి తీవ్రగాయాలైన వారిని నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో కొరాపుట్‌లోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకి తరలించారు. బాధితులంతా నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని ఒక జీడి పరిశ్రమకి చెందిన కార్మికులుగా గుర్తించారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు



నాటుసారాతో పట్టుబడిన నిందితుడు

జయపురం: అక్రమంగా నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు జయపురం ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారీ మిశ్ర వెల్లడించారు. అరెస్టైన వ్యక్తి జయపురం సమితి ఘివురి గ్రామానికి చెందిన కర్ణ బిశాయిగా పేర్కొన్నారు. తమ సిబ్బందితో ఘివురి రహదారిలో పెట్రోలింగ్ జరుపుతుండగా సారా తరలిస్తున్న కర్ణ పట్టుబడినట్లు వెల్లడించారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.


అపురూప కర్త



ఆంజనేయ స్వామి విగ్రహం

దేశంలోనే ఖ్యాతి గాంచిన ఖైరతాబాద్ మహాగణపతి రూపశిల్పి ఒడిశా వాసి అని ఎందరికి తెలుసు..! కొరాపుట్‌కు చెందిన చిత్రాడ జోగారావు మట్టి ‘విశేష ఆకృతి’గా రూపుదాల్చడంలో కీలకంగా వ్యవహరిస్తారు. మూడేళ్ల నుంచి మృణ్మయనాథుడి మహాకృతికి ప్రాణం పోస్తున్న ఉత్కళవాసి, ఆ మహాక్రతువు దిగ్విజయంగా పూర్తి చేయడానికి చేస్తున్న కృషి వర్ణించలేనిది. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 70 అడుగుల భారీ విగ్రహాన్ని మట్టితో రూపొందించడం అంత ఆషామాషీ కాదని చెబుతున్న అపు‘రూప’కర్తను సాక్షి పలకరించింది. బోలెడు విషయాలు సమీకరించింది. అదే ఈ వారం సండే స్పెషల్.

– కొరాపుట్



జోగారావు రూపొందించిన సప్తముఖ మహా శక్తి గణపతి నమూనా



చివరి దశలో దేవీ విగ్రహం

దేవుడిని చేస్తున్న మనిషి కోసం..

చిత్రాడ జోగారావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా పూండి సమీపంలో నారాయణరావు పేట. చాలా ఏళ్ల క్రితం వీరి కుటుంబం ఒడిశాలోని కొరాపుట్ ప్రాంతానికి వలస వెళ్లి అక్కడే స్థిరపడింది. ఈయన స్వర్ణకారుడు. కానీ చిన్ననాటి నుంచి విగ్రహ తయారీ అంటే విపరీతమైన మక్కువ. ఆ దిశగా సాధన చేశాడు. సక్సెస్ అయ్యాడు.

- 2022లో ఖైరతాబాద్‌లో 60 అడుగుల మహాగణపతిని రూపుదిద్దాడు.
- 2023లో అక్కడే 64 అడుగుల విగ్రహానికి ప్రాణం పోశాడు.
- ఈ ఏడాది ఏకంగా 70 అడుగుల మహాకృతి నిర్మాణంలో బిజీగా ఉన్నాడు.
- అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ దుండిలో 72 అడుగుల మృణ్మయనాథుడ్ని తీర్చిదిద్దే బాధ్యతను కూడా జోగారావే తీసుకున్నాడు.
- ఆంధ్రా తెలంగాణలోని వివిధ దేవాలయాల నిర్మాణంలో తన ప్రతిభను నిరూపించుకున్నాడు.
- శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి సమీపంలోని కుంచాలకూర్మయ్య పేటలోని దేవీ ఆశ్రమంలో శ్రీయంత్రం తదితర విగ్రహాల్ని జోగారావే రూపుదిద్దారు.
- ప్రస్తుతం కొరాపుట్‌లోని జగన్నాథ శబరి క్షేత్రంలో శిల్పిగా విధులు నిర్వర్తిస్తున్నారు.
- సూక్ష్మ విగ్రహాల రూపకల్పనలో సిద్ధహస్తుడు.

- ఖైరతాబాద్ గణపతిని చేస్తున్న కొరాపుట్‌వాసి
- 70 అడుగుల మట్టి గణపతి నిర్మాణంలో బిజీగా శిల్పి జోగారావు
- విజయవాడలోనూ 72 అడుగుల మహా గణపతి నిర్మాణం
- తెలుగు రాష్ట్రాల్లోని ఆలయ నిర్మాణాల్లో భాగస్వామ్యం

‘అనూహ్యంగా మెరిసిన ఊహకు.. ఆధ్యాత్మిక ఆలోచనా స్రవంతికి.. అపార అనుభవం తోడైతే.. ఆది దేవుని కృపతో సృజన శక్తి వెల్లివిరిస్తే.. సృష్టించవచ్చు ఎన్నో అపురూపాల్ని.. ప్రతిష్టించవచ్చు ప్రజలు మెచ్చే దైవాల్ని. తెలుగు రాష్ట్రాల్లో ఖ్యాతి గాంచిన ఖైరతాబాద్ మహా గణపతి రూపశిల్పి చిత్రాడ జోగారావు నమ్మేదీ.. నమ్ముతున్నదీ ఇదే. కథలన్నీ కంచికి చేరితే ఏటా వినాయక భక్తుల ఆలోచనలన్నీ భాగ్యనగరంలోని ఖైరతాబాద్‌కు చేరుకుంటాయి. ప్రతి సారీ బొజ్జగణపయ్య ఏం రూపంలో.. ఎలా కనిపిస్తాడా.. అని వేయికళ్లతో ఎదురుచూస్తుంటారు భక్తులు. ఆ రూపం తీర్చిదిద్దే బాధ్యతను మూడేళ్లుగా భుజానికెత్తుకున్నారు శిల్పి జోగారావు.

అవకాశం వచ్చిందిలా..

1954లో ఖైరతాబాద్ ప్రాంతంలో తొలిసారి గణపయ్య విగ్రహాల్ని ప్రతిష్ఠించారు. అప్పుడు ఒక్క అడుగుతో మొదలైంది. ఏటా ఎత్తు పెరుగుతూ ప్రస్తుతం 70 అడుగులకు చేరింది. అయితే భారీ విగ్రహం కావడంతో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌ను తయారీకి వినియోగించేవారు. ఇటీవల కాలంలో జలవనరుల కాలుష్యం కారణంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీని ప్రభుత్వం నిషేధించింది. ఉత్సవ కమిటీకి అప్పుడు గుర్తొచ్చింది చిత్రాడ జోగరావు పేరు. గతంలో ఉండే పరిచయంతో కమిటీ చైర్మన్ సింగరి రాజ్‌కుమార్ జోగారావును సంప్రదించారు. అనేక తర్జన భర్జనల తర్వాత మట్టి గణపయ్యను రూపుదిద్దే బాధ్యతను ఆయనకు అప్పగించారు.

ఆషామాషీ వ్యవహారం కాదండోయ్..

ఖైరతాబాద్ మహా గణపతి విగ్రహం నిర్మాణం ఆషామాషీ వ్యవహారం కాదు. ఆ ఏడాది ప్రజలు ఎదుర్కొన్న బాధల విముక్తికి.. సుఖశాంతులు కలిగేలా గణపయ్య కరుణాకటాక్ష వీక్షణాల కోసం ప్రతి ఏటా ఒక్కో రూపంలో గణపయ్యను రూపొందిస్తారు. సిద్ధాంతి విఠల్‌శర్మ సూచన మేరకు ఈ ఏడాది శ్రీ సప్తముఖ మహాశక్తి గణపయ్యతో సహా రాహుకేతువుల్ని పూజిస్తే దేశానికి మంచిదనే ఉద్దేశాన్ని కమిటీ సభ్యులు శిల్పి జోగారావుకు వివరించారు. వారి ఆలోచనలను తొలుత కంప్యూటర్ రూపంలో తెరకెక్కించి శభాష్ అనిపించుకున్నారు జోగారావు. ప్రస్తుతం నిర్మాణ పనుల్లో బిజీగా ఉన్నాడు.



ఖైరతాబాద్‌లో రూపుదిద్దుకుంటున్న శ్రీసప్త ముఖ మహాశక్తి గణపతి


గొప్ప అవకాశం..

నాకు చిన్ననాటి నుంచి ఖైరతాబాద్ గణపతి అంటే ప్రత్యేకమైన ఆసక్తి. విగ్రహం తయారీలో భాగస్వామిని కావాలని మనసులో ఉండేది. 2015లో ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవకమిటీ సభ్యులను కలిసే అవకాశం వచ్చింది. విజయవాడలో నేను రూపొందించిన భారీ మట్టి విగ్రహాన్ని చూసేందుకు వచ్చిన సందర్భంలో అయిన పరిచయం.. నాకలను నెరవేర్చింది. మట్టిగణపయ్యను రూపొందించడం సరే.. శోభాయాత్ర సమయంలో వర్షం కురిస్తే పరిస్థితి ఏమిటి అనే విషయాన్ని కమిటీ నా ముందు ప్రస్తావించింది. నేను చాలా సమస్యలకు పరిష్కారం వివరించా. వాళ్లు అవకాశం ఇచ్చారు. ఇది పూర్వజన్మ సుకృతంగానే భావిస్తున్నాను. ఒక తెలుగు వాడిగా.. రెండు తెలుగు రాష్ట్రాలు కొలిచే మహాగణపతుల నిర్మాణం నా చేతుల మీదుగా జరగడం అదృష్టం.

– చిత్రాడ జోగారావు, ఖైరతాబాద్ మహాగణపతి శిల్పి, కొరాపుట్



గణేషుని భారీ పాదాలు



రాహు కేతువు విగ్రహాలు



అమ్మవారి విగ్రహం



దేవీ విగ్రహం



శివ పార్వతుల కల్యాణం

శ్రీ సప్త ముఖ మహాశక్తి గణపతి ప్రత్యేకతలివే..

- 1954లో మొదలైన గణపతి ప్రస్థానం 70వ ఏడాదికి చేరుకుంది.
- అందుకే ఈ ఏడాది విగ్రహం ఎత్తు 70 అడుగులుగా నిర్ణయించారు.
- వేదికపైన ప్రధాన విగ్రహానికి కుడి, ఎడమ వైపు శ్రీనివాస కల్యాణం, శివపార్వతుల కల్యాణం విగ్రహాలు ప్రధాన ఆకర్షణ.
- వేదిక దిగువభాగంలో అయోధ్య రాముడు, రాహువు కేతువుల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు.
- విగ్రహాల తయారీకి రాజస్థాన్ నుంచి 1000 మట్టి బస్తాలు (ఒక్కో బస్తా 30 కేజీలు) తెప్పించారు.
- నిర్మాణంలో కర్ర పొట్టు, వరి పొట్టు, మట్టి, పర్యావరణ అనుకూల రంగులు, ఇసుక వినియోగిస్తున్నారు.
- నిమజ్జనంలో ఈ విగ్రహ తయారీలో వినియోగించే పదార్థాలు చేపలకు ఆహారంగా ఉపయోగపడతాయని తయారీదారులు చెబుతున్నారు.

చేయితిరిగిన కళాకారుడు



జోగారావు కళ అద్భుతం. మట్టి గణపతి తయారీలో ఆయన అందెవేసిన చేయి. నిరంతర అధ్యయన శీలి.

రాజేంద్రన్, ఖైరతాబాద్ మహాగణపతి ప్రధాన శిల్పి

మా అదృష్టం..



ప్రభుత్వం ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలపై నిషేధం విధించింది. మట్టి విగ్రహం ఏర్పాటు చేయాలి. ఇంత భారీ స్థాయిలో మట్టిగణపయ్యను ఎవరు చేస్తారు.. ఇదే ఆలోచన.. జోగారావు గుర్తొచ్చారు. సంప్రదించాం. 11 రోజుల పూజలు. శోభాయాత్ర ఇతర పరిస్థితులు వివరించాం. సరే అన్నారు. మహాగణపతే ఆయన్ని మాకు పంపించారనే భావిస్తున్నాం. మూడేళ్లుగా ఆయనే రూపొందిస్తున్నారు.

– సింగరి రాజ్‌కుమార్, ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ చైర్మన్

విజిలెన్స్ దాడులు



వినయ్ భూషణ్ త్రిపాఠి

భువనేశ్వర్: లంచం, పన్ను ఎగవేత, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై జాజ్‌పూర్‌లోని సీటీ, జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ అసిస్టెంట్ కమిషనర్ వినయ్ భూషణ్ త్రిపాఠికి చెందిన ఐదు స్థావరాలపై ఏకకాలంలో ఒడిశా విజిలెన్స్ విభాగం దాడులు చేపట్టింది. వినయ్ భూషణ్ త్రిపాఠి ఇఖీ, సీటీ, జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఏడాది మే 7వ తేదీన రూ.8.89 లక్షల విలువైన స్క్రాప్‌ను తీసుకెళ్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. అనంతరం సీజ్ చేసిన సరుకు యజమానిని సంప్రదించి వాహనం, సరుకు విడుదల చేసేందుకు రూ.2.50 లక్షలు లంచంతోపాటు రూ. 3.20 లక్షలు పన్ను చెల్లించాలని డిమాండ్ చేశాడు. అయితే యజమాని లంచం చెల్లించకపోవడంతో వినయ్ భూషణ్ త్రిపాఠి స్క్రాప్ మొత్తం సరుకును మరొక డీలర్‌కు విక్రయించి, పన్ను మొత్తాన్ని జేబులో వేసుకుని, మిగిలిన రూ.5.85 లక్షలను జీఎస్టీ చట్టాలు, నైతిక ప్రామాణికలను స్పష్టంగా ఉల్లంఘిస్తూ దుర్వినియోగం చేసినట్లు ఆరోపణ. ఈ నేపథ్యంలో విజిలెన్స్ విభాగం ఆయన ప్రభుత్వ క్వార్టర్, తండ్రి ఇల్లు, ఫామ్‌హౌస్, ఫ్లాట్ మరియు గ్రామ నివాసాల్లో సోదాలు చేపట్టింది. దాడుల్లో 7 మంది డిప్యూటీ సూపరింటెండెంట్లు, 14 మంది ఇన్‌స్పెక్టర్లు, 25 మంది ఇతర సిబ్బందితో కూడిన బృందం పాల్గొంది.

పోలవరం ముంపు ప్రాంతాలకు కాంగ్రెస్ బృందం



కొరాపుట్: పర్యటనకు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు



మల్కన్‌గిరి: ముంపు గ్రామాలను పరిశీలిస్తున్న నేతలు

కొరాపుట్: పోలవరం ప్రాజెక్ట్ ముంపు ప్రాంతాలకు కాంగ్రెస్ బృందం బయల్దేరింది. శనివారం ఉదయం కొరాపుట్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. పోలవరంపై ఆంధ్రప్రదేశ్ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఇప్పుడు తాము పోలవరం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు. అక్కడ నిర్వాసితులకు అందాల్సిన ఆర్థిక పరిహారంపై క్షేత్రస్థాయి పర్యటనలో పరిశీలిస్తామని పేర్కొన్నారు. పోలవరం వలన అక్కడ వందలాది గ్రామాలు నీట మునుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యామ్ అనుమతి ఏకపక్ష నిర్ణయమని, దీనిపై తాము ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కొరాపుట్ నుంచి బయల్దేరిన బృందంలో కాంగ్రెస్ శాసనసభ పక్ష నాయకుడు రాం చంద్ర ఖడం, రాయగడ ఎమ్మెల్యే అప్పల స్వామి కద్రక, గుణుపూర్ ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్ తదితరులు ఉన్నారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి మోటు ప్రాంతంలో పోలవరం ప్రాజెక్టు వలన ముంపునకు గురయ్యే మోటు, అల్మా, పేట, వినయక్‌పూర్, కమలపూర్, పుష్పగూడ, మురలిగూడ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముంపు ప్రమాదం పొంచివున్న దృష్ట్యా ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని, అలాగే నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు.

‘లక్ష్మీ బస్సులతో ప్రైవేటు బస్సులకు నష్టాలు’



సమావేశంలో పాల్గొన్న లక్ష్మీకాంత సెథి తదితరులు

పర్లాకిమిడి: లక్ష్మీ బస్సులతో ప్రైవేట్ బస్సు యాజమాన్యాలకు నష్టాలు వస్తున్నాయని వివిధ ప్రైవేటు బస్సు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి నోడల్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి ఒడిశా రాష్ట్ర ఆర్టీసీ అదనపు కార్యదర్శి లక్ష్మీకాంత సెథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత కొన్ని నెలలుగా ప్రైవేటు బస్సులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. గజపతి జిల్లావ్యాప్తంగా 26 లక్ష్మీ బస్సులు తిరుగుతున్నాయని, అయితే లక్ష్మీ బస్సులు మోహనా, కాశీనగర్, గుమ్మా, నువాగడ, ఆర్. ఉదయగిరి సమితిల నుంచి పంచాయతీల్లో పలు గ్రామాలకే నడపాలని ప్రైవేటు బస్సు ఓనర్లు కోరారు. ప్రైవేటు బస్సులు నడిపే రూట్లలో ప్రభుత్వ బస్సులు నడపడం ద్వారా వారికి సంభవిస్తున్నాయన్నారు. అయితే లక్ష్మీ కాంత సెథీ మాట్లాడుతూ.. లక్ష్మీ బస్సుల్లో టిక్కెట్లు తక్కువ ధర నిర్ణయించడం అనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఏఏ రూట్లలో బస్సులు కొరత ఉందో అక్కడే కొత్త బస్సులు వేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గజపతి జిల్లాలో ఇప్పటివరకు 56 నూతన బస్టాండులు నిర్మించామని, మరో 78 బస్టాండ్లు నిర్మిస్తామని, లక్ష్మీ బస్సు సేవలు గజపతి జిల్లాలో ఎప్పటిలాగే కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు జిల్లా మేజిస్ట్రేటు రాజేంద్ర మింజ్, అదనపు డీఎస్పీ సునీల్ కుమార్ మహంతి, సబ్ కలెక్టర్ అనూప్ పండా, ఆర్టీవో ప్రసన్న కుమార్ దాస్, ఒడిశా ఆర్టీసీ పర్యవేక్షకుడు తన్మయ కుమార్ ప్రధాన్, బస్సు ఆపరేటర్ల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'త్వరలో పూరీకి ఆర్టీసీ బస్సు'

పర్లాకిమిడి: పవిత్ర మహేంద్రగిరి పర్వతం బుర్‌ఖాత్ పాస్ నుంచి పూరీ పుణ్యక్షేత్రం వరకు ఓఎస్ ఆర్టీసీ బస్సు రూట్‌ను త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణా, ఖనిజ శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెన్నా ప్రకటించారు. గురువారం పర్లాకిమిడి సర్క్యూట్ హౌస్‌కి వచ్చిన సందర్భంగా ఆయన ఈ నిర్ణయం తెలియజేశారు. అనంతరం కోయిపూర్ దగ్గరలో ఉన్న మహేంద్రగిరి పర్వతాలు, కుంతీ ఆలయం సందర్శించారు. మహేంద్రగిరిని ఒక ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

'ఎన్‌ఎంఎంఎస్ ఒరియాలోనూ నిర్వహించాలి'



దేవానందరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బృందావన్ దొళాయి తదితరులు

కవిటి: నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎం ఎస్) ప్రతిభా పరీక్షను ఒడియా లింగ్విస్టిక్స్ విద్యార్థుల కోసం ఒడియా మీడియంలోనూ ప్రశ్నపత్రం అందించాలని ఏపీ ఒరియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) సంఘం ప్రతినిధులు కోరారు. శనివారం శ్రీకాకుళంలో రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానంద రెడ్డిని అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దోళాయి, ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గ ప్రసాద్ చౌధురీ కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దొళాయి మాట్లాడుతూ ఒరియాలోనూ ప్రశ్న పత్రం ఉంటే ఒరియా విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఒరియాలో అవకాశం లేకపోవడంతో చాలామంది ప్రతిభావంతులైన పిల్లలు అవకాశం కోల్పోతున్నారని తెలిపారు. పేద పిల్లల భవిష్యత్ దృష్ట్యా దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై డైరెక్టర్ దేవానంద రెడ్డి మాట్లాడుతూ అవసరమైన చర్యలు తీసుకుంటానని అన్నారు.

సీఐలకు స్థానచలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖ రేంజి పరిధిలో 52 మందికి బదిలీ చేస్తున్నట్లు విశాఖపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా నుంచి నలుగురు బదిలీపై వెళ్తుండగా నలుగురు ఇక్కడికి వస్తున్నారు. పి.పైడయ్య (టెక్కలి), ఎస్‌హెచ్‌వీ ఆనంద్ (కాశీబుగ్గ అర్బన్), జి.దివాకర్‌వాయునందన్‌యాదవ్ (ఆమదాలవలస)లు విశాఖ వీఆర్‌కు, చోళంగి వెంకటరావు శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ నుంచి జి.మాడుగుల (ఏఎస్ఆర్ జిల్లా)కు వెళ్తున్నారు. అలాగే ఎ.విజయ్‌కుమార్ నక్కపల్లి (అనకాపల్లి జిల్లా) నుంచి టెక్కలి, దాడి మోహనరావు రాజాం టౌన్ (విజయనగరం) నుంచి కాశీబుగ్గ అర్బన్, పాండ్రంకి సత్యనారాయణ ఎల్విన్‌పేట (పీపీఎం–మన్యం) నుంచి ఆమదాలవలస, బూర ప్రసాదరావు విశాఖ వీఆర్ నుంచి కళింగపట్నం మెరైన్ సీఎస్‌పీఎస్‌కు రానున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఉమెన్స్ కళాశాల రోడ్డు మార్గంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. శనివారం ఉదయం సుమారు 11.15 గంటల సమయంలో ఓ వృద్ధుడు మిల్లు జంక్షన్ నుంచి ఉమెన్స్ కళాశాల రోడ్డువైపు వచ్చి డీపీఆర్వో కార్యాలయం వైపు వెళ్లేందుకు మలుపులో తిరుగుతుండగా సూర్యమహల్ నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న ముగ్గురు యువకులు ఢీకొన్నారు. దీంతో వృద్ధునికి గాయాలయ్యాయి. ఈ ముగ్గురు యువకుల్లో మైనర్లు కూడా ఉన్నారు. సమీపంలో ఉన్న స్థానికులు, ఢీకొట్టిన యువకులు వృద్ధుడిని లేపి ముందుగా రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం వేరే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీనిపై ఎలాంటి సమాచారం తమకు అందలేదని ట్రాఫిక్ పోలీసులు చెప్పడం గమనార్హం.

వృద్ధురాలిపై కోతుల దాడి

కాశీబుగ్గ: మందస మండలం బెల్లుపటియా గ్రామంలో కోతుల దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన కొండల సావిత్రి పొలం పనులకు వెళ్తున్న సమయంలో కోతులు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో కొండల సావిత్రి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను సిరిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మండలంలోని పొత్తంగి, సిరిపురం, బెల్లుపటియా, సోంపేట మండల పరిధిలోని బూషభద్ర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి స్థానిక ప్రజలను కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

కాశీబుగ్గ: మందస మండల జాతీయ రహదారిపై శనివారం పశువులను అక్రమంగా వ్యానులో తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు దొరికారు. ఐచర్ వ్యాన్‌లో 9గేదెలు, నాలుగు గేదె పెయ్యలను తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో శనివారం వేకువజామున పోలీసులు పట్టుకున్నారు. పశువులను బరంపురం నుంచి విజయనగరం జిల్లా అలమండ తరలిస్తున్నట్లు సమాచారం. ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

భద్రత కోసం నిరసన గళం..!

- కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ అత్యాచారాన్ని ఖండిస్తూ వైద్యుల నిరసనలు
- ఆస్పత్రుల్లో నిలిచిపోయిన సాధారణ వైద్య సేవలు



భువనేశ్వర్: మహిళల భద్రతపై నిరసన



భువనేశ్వర్: కటక్ రాణీ హట్ స్క్వేర్ క్లాక్ టవర్ వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ

కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ అండ్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన దాడిని రాష్ట్రవ్యాప్తంగా వైద్యులంతా ముక్తకంఠంతో ఖండించారు. ఈ కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంపై నిరసన గళం వినిపించారు. నిందితుడిని తక్షణమే ఉరితీయాలని, కేసును త్వరితగతిన పరిష్కరించాలని, వైద్యులకు భద్రత కల్పించాలని కోరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపు మేరకు రాష్ట్రమంతటా వైద్యులు శనివారం తమ సేవలను నిలిపివేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కొరాపుట్: ఎస్ఎల్ఎన్ వైద్య కళాశాల వద్ద హౌస్ సర్జన్ల ఆందోళన



భువనేశ్వర్: న్యాయం కావాలి నినాదంతో వైద్య విద్యార్థుల ఆందోళన



రాయగడ: నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న వైద్యులు



రాయగడ: క్యాండిల్స్ వెలిగించి నిరసన తెలుపుతున్న బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు



కొరాపుట్: నబరంగపూర్ బీజేపీ కార్యాలయంలో నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న మహిళలు



భువనేశ్వర్: కోల్‌కతా పరిస్థితి పునరావృతం కారాదనే నినాదంతో వైద్యుల నిరసన



భువనేశ్వర్: కటక్ ఎస్సీబీ వైద్యుల ఆందోళన

సీఎం మోహన్‌చరణ్‌తో డీజీపీ భేటీ



కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ వై.బి.ఖురానియా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీతో ఆయన కార్యాలయంలో శనివారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరిరువురి మధ్య రాష్ట్రంలో శాంతిభద్రతలపై సంభాషణ జరిగినట్లు తెలిపారు. అంతకుముందు ఆయన పూరీలో శ్రీజగన్నాథుడిని దర్శించుకున్నారు.

– భువనేశ్వర్

ఈ భోజనం ఎలా తింటారు..?



తాను తీసుకొచ్చిన భోజనాన్ని మంత్రి సూర్యవంశీకి చూపిస్తున్న ఎమ్మెల్యే పవిత్ర శాంత

- విద్యార్థుల భోజనంపై ఎమ్మెల్యే వినూత్న నిరసన
- భోజనం ప్లేట్‌తో విద్యాశాఖ మంత్రి వద్దకు పయనం

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత వినూత్న నిరసనతో ప్రభుత్వం దిగి వచ్చింది. లక్ష్మీపూర్ సమితి దొరడా ఆదివాసి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాతి భోస్లాని శనివారం సస్పెండ్ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. ఎమ్మెల్యే పవిత్ర తరచూ ఆదివాసి ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన నియోజకవర్గంలోని దొరడా పాఠశాలకు ఉదయం 10.30 గంటల సమయంలో వెళ్లారు. అయితే అప్పటివరకు సిబ్బంది ఎవరూ విధులకు హాజరవ్వకపోవడంతో మండిపడ్డారు. అనంతరం అకస్మాత్తుగా విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టే సమయంలో మరలా అక్కడికి చేరుకున్నారు. విద్యార్థులకు పురుగులు పట్టిన అన్నం పెడుతుండడం చూసి మండిపడ్డారు. అన్నం ఉన్న కంచంతో సుమారు 80 కిలోమీటర్లు ప్రయాణం చేసి రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సురజ్ సూర్యవంశీ ఉన్న చోటుకి చేరుకున్నారు. అక్కడ తాను తెచ్చిన అన్నం రుచి చూడమని మంత్రికి సూచించారు. దీంతో అటువంటి ఆహారం విద్యార్థులకు ఇస్తుండడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ ఉన్న చోటుకి మరలా ఆ కంచం పట్టుకొని ఎమ్మెల్యే వెళ్లారు. దీంతో హుటాహుటిన హెచ్‌ఎంను సస్పెండ్ చేశారు.



విద్యార్థుల ఆహారం ఉన్న కంచంతో లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత

రహదారి సౌకర్యాలు లేక ఇబ్బందులు

- ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని బొరిగుమ్మ సమితి అభివృద్ధి పథంలో పయనిస్తున్నా, రహదారి సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ఆవేదన వ్యక్తం చేశారు. బొరిగుమ్మ సమితి కార్యాలయంలో సమితి అధ్యక్షురాలు దీప్తిమయి అధ్యక్షతన సమితి సభ్యుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఏ గ్రామాలకు రహదారులు లేవో జాబితాను సర్పంచ్‌లు సమితికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశానికి సాగునీటి విభాగ అధికారి, అటవీ విభాగ అధికారులు హాజరవ్వకపోడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని బీడీవోను ఆదేశించారు. బొరిగుమ్మ సమితిలోని 11 పాఠశాలలను ఎందుకు మూసివేశారని ప్రశ్నించారు. కోట్‌పాడ్ నియోజకవర్గంలోని బొరిగుమ్మ పంచాయతీలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, వర్షాకాలంలో ఎన్ని పాఠశాలల పైకప్పుల నుంచి నీరు కారుతోందని కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర ప్రశ్నించారు. సెంట్రల్ కిచెన్ సెంటర్ వారు సమితిలో 131 పాఠశాలలకు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదని జిల్లా పరిషత్ సభ్యుడు ప్రసాద్ బిడిక ఆరోపించారు. సమావేశంలో కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా, సమితి ఉపాధ్యక్షుడు రమాకాంత సామంతరాయ్, జెడ్పీ సభ్యుడు నృసింహనాథ్ శతపతి, ఏబీడీవో మాధురీ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

సిమ్ బాక్స్ జప్తు

- నిందితునికి అంతర్జాతీయ లింక్..?



జప్తు చేసిన సిమ్ బాక్స్‌తో నిందితుడు



సంజీవ్ పండా

భువనేశ్వర్: ఒడిశాలోని భువనేశ్వర్ నగరంలో వెలుగు చూసిన సిమ్ బాక్స్ బాగోతం సంచలనం రేపుతోంది. ఈ సిమ్ బాక్స్ ద్వారా పాకిస్థాన్, చైనా, మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చే కాల్స్‌ను నిందితుడు భారత్‌లోకి మళ్లిస్తున్నాడు. సైబర్ మోసాలు, ఉగ్రవాదం తదితర నేరాలకు వినియోగించినట్లు భువనేశ్వర్ పోలీస్ కమిషనర్ సంజీవ్ పండా శనివారం మీడియా ముందు వెల్లడించారు. సిమ్ బాక్సు వ్యవహారంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన రాజు మండల్‌ను శనివారం అరెస్టు చేశారు. పోలీసు విచారణలో ఈ నేరంలో ప్రధాన సూత్రధారి బంగ్లాదేశ్ పౌరుడు అషద్దూర్ జమాన్‌గా పేర్కొన్నారు.

అద్దె ఇంట్లో ఉంటూ...

అషదుర్ జమాన్ 2023 అక్టోబర్ 21న భారతదేశంలోకి ప్రవేశించాడు. భువనేశ్వర్‌కు వచ్చి రాజు మండల్‌తో కలిసి లింగరాజ్ హోటల్‌లో బస చేశాడు. అనంతరం ఒక ఇంటిని అద్దెకు తీసుకుని సిమ్ బాక్స్ రాకెట్ నడుపుతున్నాడు. రాజు మండల్ అషద్దూరు ఆధ్వర్యంలో నగరంలో పని చేస్తున్నాడు. పోలీసులు చేపట్టిన గాలింపు చర్యలో 5 ఆపరేషనల్ సిమ్ బాక్స్‌లు దొరికాయి. పెద్ద సంఖ్యలో సిమ్‌లు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 58 సిమ్‌లు ఉపయోగించలేదు. రాజును రిమాండ్‌కు తరలించి మరింత సమాచారం సేకరిస్తామని పోలీసు కమిషనర్ సంజీవ్ పండా తెలిపారు.

నేరాలు చేసేందుకే...

ఈ సిమ్ బాక్స్ ద్వారా విదేశాల నుంచి కాల్ వచ్చినా, లోకల్ సిమ్ ద్వారానే వచ్చినట్లు చూపిస్తుంది. విదేశాల నుంచి వచ్చిన నేరస్తులు భారత్‌లో నేరాలకు పాల్పడేందుకు దీన్ని ఉపయోగిస్తున్నారు. ఇది తీవ్రవాదం, సైబర్ మోసం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కోసం ఉపయోగించబడుతుంది. ప్రధానంగా పాకిస్థాన్, చైనా, మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చే కాల్స్ లోకల్ సిమ్ ద్వారా భారత్‌కు మళ్లించబడుతున్నాయి. నిందితుడు విదేశీయుడు కావడంతో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ద్వారా దర్యాప్తు చేయనున్నారు. అవసరమైన చోట ఇంటర్‌పోల్ సహాయం కూడా తీసుకుంటామన్నారు. కాల్ వివరాలు విశ్లేషించబడతాయి. ఫలితంగా ఏ దేశం నుంచి, ఏ ప్రయోజనం కోసం కాల్ వస్తోందో సైబర్ నిపుణులచే దర్యాప్తు చేయబడుతుంది. గత 8 నెలలుగా రాజు మండల్ భువనేశ్వర్‌లోని ఓ ఇంట్లో నెలకు ఒకటి రెండు సార్లు సిమ్ బాక్స్‌ను చూసేవాడు. వారు భారతదేశంలోని వివిధ ప్రాంతాల్లో సిమ్ బాక్సులను అమర్చారు. ఇది బంగ్లాదేశ్ నుంచి నిర్వహించబడుతుంది. ప్రధాన నిందితుడు అసద్దూర్ బంగ్లాదేశ్ నుంచి దీన్ని నిర్వహిస్తున్నాడు.

భువనేశ్వర్ నుంచి కార్యకలాపాలు..?

భువనేశ్వర్‌లో విదేశీ సిమ్ బాక్సులను ఉంచి నేర కార్యకలాపాలు సాగిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీని ఆధారంగా నగర డీసీపీ ప్రతీక్ సింగ్ ఆదేశాల మేరకు స్థానిక లక్ష్మీసాగర్ ఠాణా పోలీసులు ప్రత్యేక స్క్వాడ్‌ను సిద్ధం చేసి మెరుపు దాడి చేశారు. సోదాల్లో ఇంట్లోని ర్యాక్‌లో ఏడు సిమ్ బాక్సులు లభ్యమయ్యాయి. సిమ్ బాక్స్‌లు ఇంటర్నెట్ కనెక్షన్ మరియు విద్యుత్ సరఫరాను కూడా కలిగి ఉన్నాయి. ఈ ఘటనలో రాజు మండల్ సంతృప్తికరమైన సమాధానం చెప్పకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం శనివారం పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

సిమ్ బాక్స్ అంటే ఏమిటి?

సిమ్ బాక్స్ ఒక పరికరం. ప్రపంచంలో ఎక్కడైనా దాని నుంచి కాల్‌లు, సమూహ సందేశాలు చేయవచ్చు. ఫోను చేసే వ్యక్తి వివరాలు బయటపడనీయకుండా ఇది ఉపయోగపడుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఉగ్రవాద నెట్‌వర్క్‌లను నడపడం, సైబర్ మోసాలు మరియు విదేశాలకు రహస్య సమాచారాన్ని అందించడం వంటి తీవ్రమైన నేరాలకు సిమ్ బాక్స్‌లు ఉపయోగపడతాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- జిల్లా కలెక్టర్ ఫరూల్ పట్వారీ



మాట్లాడుతున్న కలెక్టర్ పట్వారి తదితరులు

రాయగడ: రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఫరూల్ పట్వారి అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా సడక్ సురక్షాపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీనిలో భాగంగా ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్నటువంటి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి, పోలీసులు సంయుక్తంగా ఈ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత 7 నెలల్లో 137 రోడ్డు ప్రమాదాలు జరగగా, 69 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని వివరించారు. గుమ్మ, ఖగుడి, ఫల్‌కొన, దేవదొల ఘాటీల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు మూడు రోజుల పాటు గుడారి, గుణుపూర్ వంటి ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమాలతో పాటు వాహన తనిఖీలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్, ఆర్టీవో శివప్రసాద్ చౌదరి, మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సౌమ్యరంజన్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం మార్గదర్శకం కావాలి



కొత్త ఎమ్మెల్యేలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝీ

- సీఎం మోహన్‌చరణ్ మాఝీ
- శాసన సభలో కొత్త ఎమ్మెల్యేలకు శిక్షణ



ప్రారంభోత్సవ సభలో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

భువనేశ్వర్: అసెంబ్లీలో ప్రతీ ఎమ్మెల్యేకి రాజ్యాంగం మార్గదర్శకం కావాలని సీఎం మోహన్‌చరణ్ మాఝీ అన్నారు. మొదటిసారి శాసన సభకు ఎన్నికైన ఎమ్మెల్యేలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేసే దిశగా ఈ కార్యక్రమం చేపట్టడం స్వాగతించదగ్గ విషయమన్నారు. 24 ఏళ్ల క్రితం తాను తొలిసారి శాసనసభకు ఎన్నికైనప్పుడు ఇలాంటి శిక్షణా కార్యక్రమానికి హాజరైన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. శాసన సభ సంప్రదాయాలు, చట్టాలపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. రాజ్యాంగ వ్యవస్థలో నిజమైన అధికారం ప్రజలదేనని, నియోజకవర్గం ప్రజల ఆశలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. ఒడిశాను భారతదేశంలోనే అత్యుత్తమంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా నిలిపేందుకు పార్టీలకు అతీతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్పీకర్ సురమా పాఢి, ఉప ముఖ్యమంత్రులు కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా తదితరులు పాల్గొన్నారు. అలాగే కేంద్రమంత్రి కిరణ్ రిజిజు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలను ఉద్దేశించి మార్గనిర్దేశం చేశారు.

క్లుప్తంగా

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దెబ్బతిన్న ఇల్లు

● రూ.6లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో కాలిబూడిదైన సామగ్రి

జామి: మండలంలోని జాగరం గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శ్లాబ్ ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాలు. జాగరం గ్రామానికి చెందిన జాగరపు ఈశ్వరరావు ఇంట్లో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు చేరి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రెండు ల్యాప్‌టాప్‌లు, రూ.80వేల నగదు, ఫర్నిచర్ మొత్తం కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.ఆరు లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

కారును లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

● ముగ్గురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాయుడు

కొత్తవలస : అరుకు – విశాఖ జాతీయ రహదారిలో మంగళపాలెం జంక్షన్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి వేగంగా వచ్చిన లారీ కారును ఢీకొట్టడంతో కొత్తవలస గ్రామానికి చెందిన మేలాస్త్రీ నాయుడు(23) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించి కొత్తవలస సీఐ షణ్ముఖరావు అందించిన వివరాలు ఇలా వున్నాయి. మృతుడు నాయుడుతో పాటు కొత్తవలస గ్రామానికి చెందిన మరో ముగ్గురు యువకులు బూసాల షణ్ముఖ, గొరపల్లి లోకేష్, పెంటకోటి షణ్ముఖ తన స్నేహితుడు చెల్లికి పెళ్లి సందర్భంగా పని నిమిత్తం కొత్తవలస నుంచి కారులో పెందుర్తి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో పెందుర్తి నుంచి కొత్తవలస వైపు అతి వేగంగా వచ్చిన లారీ మంగళపాలెం జంక్షన్ వద్ద బలంగా ఢీకొట్టింది. దీంతో కార్లో ప్రయాణిస్తున్న నాయుడు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. సీఐ షణ్ముఖరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొండపల్లి: మండలంలోని గరుడబిల్లి – గొట్లాం రైల్వే స్టేషన్ల మధ్య అప్ లైనుపై గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు విజయనగరం రైల్వే ఎస్ఐ బాలాజీరావు శనివారం తెలిపారు. వేకువ జామున పట్టాలు పక్కన సుమారు 34 సంవత్సరాల వయస్సు ఉండి గ్రీన్ కలర్ ప్యాంటు, రెడ్, బ్లాక్, వైట్ చారలు గల టీ షర్టును ధరించిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లుగా గుర్తించామన్నారు. మృతుని వద్ద రాయగడ నుంచి చత్రపూర్ వెళ్లే రైల్వే టిక్కెట్టు మినహ ఎటువంటి ఆధారాలు లేవని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినంత వరకు మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని మహరాజ ఆస్పత్రిలో భద్రపరచనున్నట్లు చెప్పారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

బాలిక అదృశ్యంపై కేసు

బొండపల్లి: మండలంలోని కెరటాం గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక ఈ నెల 15న విశాఖపట్నంలో ఉంటున్న అన్నయ్యను చూసేందుకు వెళ్తానని తల్లికి చెప్పి గ్రామానికి చెందిన ఆటోలో బయలుదేరింది. అదే రోజు సాయంత్రం తల్లి తన కుమారుడికి ఫోన్ చేసి కుమార్తె గురించి తెలపగా తన వద్దకు రాలేదని చెప్పాడు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

‘కంటి వెలుగు’కు మంగళం

● అవ్వాతాతలకు నిలిచిన కంటి పరీక్షలు
● వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 1,79,890 మంది అవ్వాతాతలకు ప్రయోజనం
● 28,213 మందికి శస్త్రచికిత్సలు
● 43,938 మంది అవ్వాతాతలకు కంటి అద్దాల పంపిణీ



విజయనగరం ఫోర్ట్: వృద్ధుల్లో కంటి సమస్యలను పరిష్కరించి చూపును ప్రసాదించాలనే గొప్ప సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టింది. మొదటి, రెండు విడతల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. కంటి అద్దాలు అందించారు. మూడో విడతలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు.

కూటమి ప్రభుత్వంలో మంగళం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కంటి వెలుగు కార్యక్రమాన్ని నిలిపివేసింది. గత ప్రభుత్వ హయాంలో కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కంటి వైద్యులు, అఫ్తాల్మిక్ అధికారులు గ్రామాలకు వెళ్లి అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించేవారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసి శస్త్రచికిత్సలు చేయించేవారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందజేసారు. ప్రస్తుతం అవ్వాతాతలకు గ్రామాల్లో కంటి పరీక్షలు నిలిచిపోయాయి. ఏదైనా సమస్య ఉంటే అవ్వాతాతలు కంటి ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రభుత్వ కంటి ఆస్పత్రికి వెళ్లిన వారికి ఉచితంగా సేవలు అందుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన వారు డబ్బులు వెచ్చించి వైద్య సేవలు పొందుతున్నారు.

తొలి విడతలో 2,92,462 మంది విద్యార్థులకు పరీక్షలు

డా.వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో 2019 అక్టోబర్ 10 నుంచి 16 వరకు జిల్లాలో 3357 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు పరీక్షలు చేశారు. 3,03,717 మంది విద్యార్థులకు కంటి పరిక్షలు చేయాల్సి ఉండగా 2,92,462 మంది విద్యార్థులకు కంటి పరిక్షలు నిర్వహించారు. ఇందులో 2,79,471 మందికి సాధారణ కంటి చూపు ఉంది. 13,109 మందికి కంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించి కంటి వెలుగు రెండో దశకు కంటి పరీక్షలు నిమిత్తం సిఫార్సు చేసారు.

రెండో విడత

రెండో విడత 2019 నవంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు రెండు నెలలు పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. 13,109 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 8901 మందికి సాధారణ కంటి చూపు ఉంది. ఇందులో 3844 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించి అందజేశారు. మెల్ల కన్ను శస్త్రచికిత్సలు 18 మందికి, కంటి శుక్లం శస్త్రచికిత్సలు ఐదుగురికి, రెప్పవాలటం శస్త్రచికిత్సలు 20 మందికి నిర్వహించారు.

మూడో విడతలో అవ్వతాతలకు

మూడో విడత కంటి వెలుగు కార్యక్రమం 2020 ఫిబ్రవరి 18 నుంచి అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేయడం ప్రారంభించారు. అయితే కోవిడ్ కారణంగా కొంత కాలం కంటి పరీక్షలు చేయడం నిలిపివేసారు. 2021 మే 27 నుంచి మళ్లీ కంటి పరీక్షలు పునః ప్రారంభించారు. 2024 మే మొదటి వారంలో అవ్వాతాతలకు కంటి వెలుగు కార్యక్రమాన్ని నిలిపివేసారు. మూడో విడతలో 1,79,890 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 28,213 మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు. 43,938 మంది అవ్వతాతలకు కళ్ల జోళ్లు అందించారు.

నిలిచిన ‘కంటి వెలుగు’

కంటి వెలుగు కార్యక్రమం ద్వారా అవ్వాతాతలకు కంటి పరీక్షలు ప్రస్తుతం జరగడం లేదు. విద్యార్థులకు పాఠశాలల్లో వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేసే కార్యక్రమం ప్రస్తుతం జరుగుతుంది.
–డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్ఓ

జర్నలిస్టుల సంక్షేమం పాలకుల బాధ్యత

● జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం అర్బన్: జర్నలిస్టుల సంక్షేమం పాలకులు బాధ్యతగా తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఐఎంఏ సమావేశ మందిరంలో శనివారం జరిగిన ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని జర్నలిస్టులు ఘనంగా నిర్వహించారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, సంధ్యారాణి, ఉమ్మడి విజయనగరం జిల్లాకి చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలిత అంబటి సత్రం కూడలిలో ఉన్న సంఘం వ్యవస్థాపకుడు సీవైచింతామణి విగ్రహానికి మంత్రి సంధ్యారాణి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం, ప్రజలకు మధ్య జర్నలిస్టులు వారధులు లాంటి వారని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం బాగుంటే ప్రభుత్వ పాలను ఉత్తమంగా ఉంటుందని, ఆ దిశగా గత ప్రభుత్వం పాటించిందన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదన్నారు. సీనియర్ ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా ఉందనీ విలువలు పాటించిన జర్నలిస్టులను ఈ సందర్భంగా కొనియాడారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌వీప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అదితి గజపతి రాజు, లోకం మాధవి, తోయక జగదీశ్వరి, సమాచార శాఖ జిల్లా ఏడీ డి.రమేష్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జేసీనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీనివాస్, సంఘం రాష్ట్ర ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఘనంగా వారిని సంఘం సత్కరించింది. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఏచూరి శివ, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌రాజు, మహా పాత్రో, పంచాది అప్పారావు, రాధాకృష్ణ, వైఎస్ పంతులు, డేవిడ్ రాజు, లింగాల నరసింరావు, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు, జిల్లాలో వివిధ మండలాల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్న పత్రికల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మృతదేహాల తరలింపునకు.. మానవత్వంతో స్పందించండి

● మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన ఉపాధ్యాయుల మృతదేహాల తరలింపు విషయంలో ప్రభుత్వం మానవత్వంతో స్పందించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర కోరారు. పాచిపెంట మండలం సరాయివలస సమీపంలో రాయిమాను వాగులో కొట్టుకుపోయి మృతి చెందిన హర్యానా రాష్ట్రానికి చెందిన, కొటికిపెంట ఏకలవ్య గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు మృతదేహాలను పట్టణంలో ఏరియా ఆస్పత్రి వద్ద రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డివిజి.శంకరరావుతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. మృతుల కుటుంబీకులను ఓదార్చారు. ఈ సందర్భంగా రాజన్నదొర స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ మృతదేహాలను వెంటనే వారి సొంత రాష్ట్రమైన హర్యానాకు తరలించే ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ తరలింపు మాకు సంబంధం లేదంటూ అధికార్లు తెలపడం దారుణమన్నారు. తక్షణమే విమానం వంటి వేగంగా వెళ్లే మార్గాల ద్వారా వారి సొంత రాష్ట్రమైన హర్యానాకు తరలించాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్, ఏకలవ్య డిప్యూటీ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీలతో రాజన్నదొర ఫోన్‌లైన్లో మాట్లాడారు. ఈ విషయమై చంద్రబాబు, మంత్రులు సంధ్యారాణి, లోకేష్ మానవత్వంతో స్పందించాలని కోరారు. కాగా తాను మృతుల కుటుంబాలకు కొంత ఆర్థిక సాయం చేయడానికి వెళ్లగా వారు సున్నితంగా తిరస్కరించడం వారి ఆత్మాభిమానానికి అద్దం పడుతుందని రాజన్నదొర పేర్కొన్నారు.

కదిలిన యంత్రాంగం

ఉపాధ్యాయుల మృతదేహాల తరలింపు విషయమై మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర వినతి మేరకు ప్రభుత్వ అధికార యంత్రాంగం కదిలింది. రాజన్నదొర వినతికి సంబంధించి సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో సీఎం చంద్రబాబు స్పందించి ప్రత్యేక విమానాల్లో మృతదేహాల తరలింపునకు ఆదేశాలు జారీ చేసినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. ఏరియా ఆస్పత్రికి శనివారం ఉదయమే వచ్చి మృతదేహాలను పరిశీలించి మంత్రి సంధ్యారాణి వెళ్లిన తరువాత వచ్చిన అధికారులు వీటి తరలింపు తమకు సంబంధం లేదని చెప్పడం, రాజన్నదొర వచ్చి మీడియాతో మాట్లాడడం అవి కాస్త వైరల్ కావడంతో ప్రభుత్వం స్పందించిందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

విజయనగరం: రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళ, పురుషుల షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న పోటీలను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, పూసపాటి అదితిగజపతిరాజులు ప్రారంభించారు. అనంతరం వారంతా క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ రాకెట్ పట్టి మైదానంలో ఆడారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. నిత్య సాధనతో ప్రతి క్రీడాకారుడు అనుకున్న లక్ష్యాన్ని చేధించాలని ఆకాంక్షించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాలన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించి మెన్స్ సింగిల్స్ విభాగంలో 48 మంది, డబుల్స్ విభాగంలో 24 మంది పోటీ పడుతుండగా... ఉమెన్ సింగిల్స్ విభాగంలో 40 మంది, డబుల్స్ విభాగంలో 17 మంది తలపడుతున్నారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో 40 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల 8 నుంచి 11 వరకు రాజమండ్రిలో జరగనున్న ఆల్ ఇండియా సౌత్ జోన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు, 16 నుంచి 22 వరకు బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కెఎ.నాయుడు, చైర్మన్ ఇ.రఘురాజు, గౌరవ అధ్యక్షుడు ద్వారపురెడ్డి జగదీష్, కార్యదర్శి ఎస్.సురేష్, ఉపాధ్యక్షుడు డాక్టర్ విఎస్.ప్రసాద్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అవనాపు విజయ్, అసోసియేషన్ ప్రతినిధులు వై.కుసుంబచ్చన్, పొట్నూరు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విజయనగరం వేదికగా నిర్వహించతలపెట్టిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు శనివారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో నిర్వహించిన పోటీలను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్రంలోని వివిధప్రాంతాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరుకాగా... మొదటి రోజు పోటీలు ఉత్సాహ భరిత వాతావరణంలో సాగాయి. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులుంతా క్రీడా స్ఫూర్తితో పోటీ పడి విజయావకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే నెల 7, 8, 9 తేదీల్లో ఆగ్రాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు తెలిపారు.

వంద రోజుల విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయండి : కలెక్టర్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: జిల్లాలో వంద రోజుల విజన్ డాక్యుమెంట్‌ను అన్ని శాఖలు తక్షణం తయారు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాష్ట ప్రభుత్వం విజన్ 2047పై దృష్టి సారించిందని కలెక్టర్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో ప్రాథమిక రంగాల శాఖల అధికారులతో కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు స్థాయి వ్యక్తి జీవితాన్ని మార్చేలా శాఖల విజన్ ఉండాలని ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సామాన్యుడికి ఫలాలు అందాలని, జిల్లా స్థాయి నుంచి కుటుంబ స్థాయి వరకు ఒక యూనిట్‌గా ప్రణాళికలు రచించాలని ఆయన సూచించారు. అప్పుడే విజన్ డాక్యుమెంట్‌కు సార్థకత చేకూరుతుందన్నారు. విజన్ వంద రోజుల డాక్యుమెంట్ రూపకల్పనకు అన్ని శాఖల అధికారులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. ప్రతి అంశానికి సంబంధించి విలువ ఆధారిత జోడించి కార్యాచరణ చేయాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, పరిస్థితులు, అభివృద్ధికి గల అవకాశాలను పేర్కొంటూ వంద రోజుల డాక్యుమెంట్ రూపకల్పన జరగాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆరోగ్యం, సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, స్థిరమైన అభివృద్ధి వివరాలను పొందుపరచాలని ఆయన ఆదేశించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ డాక్యుమెంట్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. 2024 సంవత్సరం నుండి 2029 సంవత్సరం వరకు శాఖల వారి అభివృద్ధికి ప్రణాళికలు అవస్యమన్నారు. ప్రతి ఏడాది కనీసం 15 శాతం వృద్ధి రేటు సాధించాలని లక్ష్యంగా ఉండాలని ఆయన తెలిపారు. ప్రణాళికల రూపకల్పనలో ఆర్థిక, భౌతిక లక్ష్యాలు స్పష్టంగా పేర్కొనాలని ఆయన ఆదేశించారు. గ్రామస్థాయి ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. ప్రాథమిక రంగాలు, తయారీ రంగాలు, సేవా రంగాల వారీగా స్పష్టమైన అవగాహన ఉండాలని ఆయన సూచించారు. జిల్లా తలసరి ఆదాయం, స్థూల ఆదాయం గణనీయంగా వృద్ధి సాధించేందుకు డాక్యుమెంట్ ఉపయోగపడాలన్నారు. ఈ నెల 26వ తేదీ నాటికి ముసాయిదా నివేదిక సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు మాట్లాడుతూ విలువ ఆధారిత ఉండే విధంగా ప్రతి అంశానికి రూపకల్పన జరగాలన్నారు. ప్రభుత్వం సూచించిన సమయానుగుణంగా ప్రణాళికలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

బీజేపీ రాజ్యసభ అభ్యర్థి ఖరారు..?

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి బిజూ జనతా దళ్ ఎంపీగా రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించిన మమతా మహంత ఇటీవల రాజ్యసభ సభ్యత్వంతో పాటు బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం నుంచి రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయింది. ఈ ఖాళీ భర్తీ చేసేందుకు ఎన్నిక జరగనుంది. మరోసారి ఆమెకి రాజ్యసభ సభ్యత్వంతో పట్టం గట్టేందుకు భారతీయ జనతా పార్టీ దాదాపు ఖరారు చేసింది. రేపో మాపో ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేయనుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. రాజ్యసభ పోటీకి అభ్యర్థులు వచ్చే నెల 21 వరకు తమ నామినేషన్లను సమర్పించవచ్చు. ఆ తర్వాత 22న నామినేషన్ పత్రాల పరిశీలన, అవసరమైతే సెప్టెంబర్ 3న రాజ్యసభ ఎన్నికలకు ఓటింగ్ నిర్వహిస్తారు.

దోపిడీ కేసులో ముగ్గురు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

రాయగడ: ఒక దోపిడీ కేసుకు సంబంధించి జిల్లాలోని కాసీపూర్ పోలీసులు ముగ్గురు నిందితులను శనివారం అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో కాసీపూర్ సమితి పరిధి తెలింగిరి గ్రామానికి చెందిన ప్రశాంత్ జొడియా, సిమిలిగుడ గ్రామానికి చెందిన రాజీవ్ మాఝి, లకరిష్ గ్రామానికి చెందిన దశమంత్ నాయక్‌లు ఉన్నారు. నిందితుల నుంచి రూ.9 వేల నగదు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

హత్యచేసి లొంగిపోయిన నిందితుడు

భువనేశ్వర్: మహిళను గొంతుకోసి చంపిన తర్వాత నిందిత యువకుడు ఠాణాలో పోలీసులకు లొంగిపోయాడు. కటక్ జిల్లా అఠాగొడా ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ దారుణ హత్య చోటు చేసుకుంది. ఆస్తి కాజేసే ఉద్దేశంతో ఈ హత్యకు పాల్పడినట్లు మృతురాలి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిగిరియా ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు.

దెయ్యం భయం



తాళాలు వేసిన ఆశ్రమ పాఠశాల భవనం

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి కదంగూడ గ్రామంలో ఉన్న ఆశ్రమ పాఠశాల హాస్టల్‌ను విద్యార్థులు ఖాళీ చేస్తున్నారు. హాస్టల్‌లో దెయ్యం ఉందనే భయంతో 55 మంది విద్యార్థులు హాస్టల్ వదిలి ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో ఆశ్రమ పాఠశాలకు తాళం వేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై పాఠశాల యాజమాన్యాన్ని వివరాలు కోరగా భూత వైద్యులను పిలిచి ప్రత్యేక పూజలు చేయిస్తామని చెప్పడం గమనార్హం.

శంఖ భవన్‌లో శిక్షణ



ప్రతాప్ కేశరి దేవ్

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో ప్రధాన విపక్షంగా కొనసాగుతున్న బిజూ జనతా దళ్ తమ కొత్త ఎమ్మెల్యేలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించనుంది. స్థానిక బీజేడీ ప్రధాన కార్యాలయం శంఖ భవన్‌లో ఎమ్మెల్యేల శిక్షణ శిబిరం నిర్వహిస్తారు. ఆగస్టు 25వ తేదీ ఉదయం 10 గంటలకు శిక్షణ జరగనుందని బీజేడీ డిప్యూటీ చీఫ్ విప్ ప్రతాప్ కేశరి దేవ్ తెలిపారు. కాగా శనివారం నుంచి అసెంబ్లీ ఆవరణలో ప్రారంభమైన శిక్షణ కార్యక్రమాన్ని బీజేడీ బహిష్కరించిందని పేర్కొన్నారు. ఇది పార్టీ నిర్ణయమని స్పష్టం చేశారు.

భద్రతా దళాలకు రాఖీలు



భద్రతా బలగాలకు పంపుతున్న రాఖీలు

కొరాపుట్: భద్రతా దళాలకు సాంప్రదాయ రాఖీలను గంజాం జిల్లా మహిళలు పంపించారు. అస్కా జిల్లాలో ముండామరయి ప్రాంతంలోని సరస్వతీ శిశు మందిర్‌కి చెందిన మాతృ భారతి, గురుమ, కళింగ వైశ్య మహిళా సంఘం మహిళలు తమ స్వహస్తాలతో 200 రాఖీలను సాంప్రదాయ పద్ధతుల్లో తయారు చేశారు. వీటిని తయారు చేయడంలో అనేక రకాల విత్తనాలు వినియోగించారు. దీంతో వీటిని కొందమాల్, గజపతి జిల్లాల్లోని జవాన్లుకు పంపించారు. ధారాకోట్ ప్రాంతంలో పని చేస్తున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి కూడా ఇటువంటి రాఖీలు పంపించారు.


ప్రదీప్ కుమార్ మహాపాత్రో అరెస్టు



పట్టుబడిన బంగారు ఆభరణాలు

భువనేశ్వర్: కేంద్రాపడా అదనపు పౌర సరఫరాల అధికారి ప్రదీప్ కుమార్ మహాపాత్రోని ఒడిశా విజిలెన్స్ అధికారులు అరెస్టు చేసి కస్టడీకి తరలించారు. భువనేశ్వర్ మరియు కటక్ నగరంలో 2 భవనాలు, 2 ఇండ్ల స్థలాలు, బ్యాంకు ఖాతా పొదుపు రూ.2.86 కోట్లు, నగదు రూ.1.21 లక్షలు, బంగారం 850 గ్రాములు మొదలైన వాటితో 336 శాతం అధికంగా ఆర్జనకు పైబడిన ఆస్తులు ఆర్జించినట్లు తేలిందని విజిలెన్సు వర్గాలు తెలిపాయి.

ధర్నాకు దిగిన దేవగఢ్ ఎమ్మెల్యే



ధర్నాలో దేవ్‌గడ్ ఎమ్మెల్యే రోమాంచ్ రంజన్ బిస్వాల్

భువనేశ్వర్: స్థానిక యువతకు ఉపాధి హామీ నినాదంతో దేవగఢ్ నియోజకవర్గం ఎమ్మెల్యే రోమాంచ్ రంజన్ బిస్వాల్ ధర్నాకు దిగారు. బారకోట్ మండలం బిదేయిబొడొకుదురొ టోల్ ప్లాజాలో స్థానిక వాహనాలపై టోల్ ట్యాక్స్ మినహాయింపు, స్థానిక యువతకు 80 శాతం ఉపాధి హామీ కల్పించాలని డిమాండ్ చేశారు. చాలా ఏళ్లుగా బిదేయిబొడొకుదురొ టోల్ ప్లాజా వద్ద స్థానిక వాహనాల నుంచి ఎలాంటి పన్ను వసూలు చేయడం లేదు. ఎన్నికల అనంతరం స్థానిక జిల్లా కలెక్టర్ బదిలీ తర్వాత టోల్ ప్లాజా నుంచి మరోసారి సుమారు వారం రోజుల నుంచి స్థానిక వాహనాల నుంచి పన్ను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. టోల్ ప్లాజా సిబ్బంది మృతదేహాల రవాణాకు వినియోగించే అంతమ యాత్ర వాహనాలు, వ్యవసాయ ఉత్పాదనలు రవాణా చేసే పేద రైతుల వాహనాల నుంచి బలవంతంగా పన్ను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక నివాసితుల నుంచి టోల్ టాక్స్ వసూలు మినహాయింపునకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చర్యలు చేపట్టేంత వరకు తాను 49వ జాతీయ రహదారిపై నిరవధికంగా కూర్చుంటానని హెచ్చరించారు.

రాయగడలో ఓటీఈటీ పరీక్షలు

రాయగడ: ఒడిశా ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (ఓటీఈటీ) రాయగడలో శనివారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య జరిగాయి. ఈ పరీక్షకు 3,384 మంది ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హాజరయ్యారు. దీనికోసం రాయగడ జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు గాను నలుగురు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లు, ప్రతీ పరీక్షా కేంద్రంలో ఒకొక్క సూపరింటెండెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్లను నియమించారు.

మద్యం నివారించాలి



సబ్ కలెక్టర్‌ను కలిసిన మహిళలు

జయపురం: మాదక ద్రవ్యాలు, మద్యం సంపూర్ణంగా నిషేధించాలని ఆల్ ఇండియా మహిళా సాంస్కృతిక సమితి కార్యకర్తలు శనివారం డిమాండ్ చేశారు. ఈ మేరకు జయపురం సబ్ కలెక్టర్ ప్రభాత్ కుమార్ పరిడను కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝీని ఉద్దేశించి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో రోజురోజుకూ మద్యం, మాదక ద్రవ్యాల అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివలన మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. సబ్ కలెక్టర్‌ను కలిసినవారిలో ఇందుమతి దాస్, ప్రియదర్శినీ, అని బాగ్, సుశీల నాయిక్, లక్ష్మణి బిశ్వాల్, ఫూల్‌మతి గదబ, రశ్మిత శిశ, సంతోష్ గదబ తదితరులు ఉన్నారు.

అధికారులపై కౌన్సిలర్ల ధ్వజం



సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు

జయపురం: స్థానిక మున్సిపల్ సభాగృహంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా పలు సమస్యలపై చర్చ జరిగింది. అయితే ఈ సమావేశంలో బీజేడీ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులపై ధ్వజమెత్తారు. దివంగత బిజూ పట్నాయిక్ శిలా విగ్రహం తయారై కొన్ని నెలలు గడుస్తున్నా, దానిని ప్రతిష్ఠించకపోవడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా బీజేడీ కౌన్సిలర్లు సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

డెంకాడ: మండలంలోని బంగార్రాజుపేట గ్రామంలో ఒక స్థల వివాదంలో రెండు వర్గాలు కొట్లాటకు దిగడంతో వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపారు. బంగార్రాజుపేట గ్రామంలో ఇంటికి ఆనుకుని ఉన్న స్థలం వివాదం నేపథ్యంలో జరిగిన కొట్లాటపై గ్రామానికి చెందిన నందిక బంగార్రాజు, కాగితాల సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.